ప్రజాశక్తి

ఆదివారం 7 జులై 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

12 పాఠశాలల్లో ఒక్కో టీచరే..!

◆ విలీన ప్రక్రియతో సర్కారు బడికి ఇబ్బందులు ◆ భర్తీకాని ఉపాధ్యాయ పోస్టులు

◆ మూడేళ్లుగా తగ్గుతున్న విద్యార్థులు



తాటితూరు కళ్లాల్లో ఒకే ఉపాధ్యాయునితో నడుస్తున్న పాఠశాల

ప్రజాశక్తి - భీమునిపట్నం

సమాజంలో నైతిక, ప్రజాస్వామిక విలువలు ధృడంగా నిలబడాలన్నా, మానవత్వం పరిమళించాలన్నా, చదువుకున్న చదువును సమాజం కోసం నిస్వార్థంగా వినియోగించాలన్నా ప్రభుత్వ బడి ఉండాలి. అయితే కొద్దికాలంగా పాలకులు అవలంబిస్తున్న విధానాలు ఎంతో మంది పిల్లలను సర్కారు బడికి దూరం చేశాయనే చెప్పొచ్చు. గత ప్రభుత్వం తీసుకున్న విలీన ప్రక్రియ నిర్ణయంతో బడిని కష్టాలు చుట్టుముట్టాయి. మండలంలోని 12 ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో టీచర్‌నే విద్యాబోధన చేస్తున్న విషయం విస్మయం గొలుపుతోంది.

భీమిలి మండలం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 67 ప్రాథమిక, 11 ప్రాథమికోన్నత, 22 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విలీన ప్రక్రియ, ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోని ఉపాధ్యాయ నియామకాలు, ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు అప్పగింత, 117 జిఒ వెరసి ప్రభుత్వ బడికి పేద పిల్లలను దూరం చేశాయనే చెప్పొచ్చు. మండలం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న వంద ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 2021-22లో 10,456 మంది విద్యార్థులు ఉండగా 2022-23లో 10,431కి ఆ సంఖ్య చేరింది. 2023-24లో 9,682కి పడిపోయింది.

మండలం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న 12 ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులకు ఒకే టీచర్ పాఠాలు చెబుతున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విలీన ప్రక్రియ ద్వారా అనేక రకాల సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పవచ్చు. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను 3 కిలోమీటర్ల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో నాడు విలీనం చేశారు. దీని వల్ల ఒక్కో పాఠశాలలో 20 మందిలోపు పిల్లలున్నారు. చిప్పాడ, దాకమర్రి పంచాయతీ దాసరిపేట, సింగన బంద పంచాయతీ కరగాని పేట, పాత మూలకుద్దు, టి.నగరపాలెం, తాటితూరు కల్లాలు, అన్నవరం పంచాయతీ పైలపేట, జివిఎంసి రెండో వార్డు బ్యాంకు కాలనీ, డెక్కతిపాలెం, నాలుగో వార్డు ఆర్‌జె.అగ్రహారం, మంగమారిపేట, కల్లివాని పాలెం ప్రాథమిక పాఠశాలలు ఒకే టీచర్‌తో నడుస్తున్నాయి. ఫలితంగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో పిల్లల ప్రవేశాలు మిగతా 2లో..



సమావేశంలో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

సరసమైన ధరలకే నిత్యావసర సరుకులు

◆ బియ్యం, పంచదార, పప్పులకు రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు

◆ జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలపై ఆర్థిక భారం పడకుండా సరసమైన ధరలకే నిత్యావసర సరుకులైన పంచదార, బియ్యం, పప్పుదినుసులను విక్రయించాలని జిల్లాలోని ట్రేడర్లు, హోల్ సేల్, రిటైల్ వ్యాపారులకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు లోబడి స్టాక్ నిల్వలను ఉంచాలని, పరిమితికి మించి నిల్వలు ఉంచరాదని తెలిపారు. బియ్యం, పంచదార, పప్పుదినుసుల ధరల నియంత్రణ, అదుపుపై సమీక్షించి మార్గదర్శకాలు జారీ చేసే నిమిత్తం సివిల్ సప్లై, మార్కెటింగ్, వర్తకులతో శనివారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆయన సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలను వివరించారు. ఇటీవల కాలంలో బియ్యం, పంచదార, పప్పుదినుసుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయని, ఈ పరిణామంతో ప్రజలపై ఆర్థికంగా భారం పడుతోందని పేర్కొన్నారు. కావున లాభ నష్టం లేకుండా సరసమైన ధరలకు సరుకులను విక్రయించాలని చెప్పారు. పరిమితికి మించి నిల్వలు ఉంచరాదని, వీటిని పరిశీలించేందుకు జిల్లాలో ప్రత్యేకంగా కమిటీని నియమించామని గుర్తు చేశారు. ప్రజల సౌకర్యార్థం నగర పరిధిలోని 13 రైతు బజార్లలో బియ్యం, పంచదార, పప్పు దినుసులతో కూడిన మిగతా 2లో..

కెజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

▶ వార్త 2లో..

సెల్ రీఛార్జ్ ధరలు తగ్గించాలని రాస్తారోకో

▶ వార్త 7లో..

గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి : సిపిఎం

▶ వార్త 5లో..

14న పాలస్తీనా సంఘీభావ సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాలస్తీనాకు సంఘీభావంగా ఆవాజ్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును ఈ నెల 14న జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఎ.అస్రఫ్ తెలిపారు. శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది వారాలుగా అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ గాజాలో సృష్టిస్తున్న మారణహోమంలో సుమారు 13 వేలకు మందికిపైగా పాలస్తీనీయులు మరణించారని, వారిలో మూడింట రెండొంతులు పిల్లలు, మహిళలే ఉన్నారని తెలిపారు. వేల మంది క్షతగాత్రులు అయ్యారని,. లక్షల మందిని ఇళ్ల నుంచి తరిమేశారని, ఇళ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు, చర్చిలు, మసీదులు అన్న విచక్షణ కూడా లేకుండా ఇజ్రాయిల్ సైన్యం, సెట్లర్ గ్యాంగులు బుల్డోజర్లతో కూల్చి వేస్తున్నాయని తెలిపారు. ఐక్యరాజ్యసమితి సహాయక శిబిరాలను సైతం ధ్వంసం చేస్తున్నారని, ఈ మారణ హోమాన్ని యావత్తు ప్రపంచం మిగతా 2లో..

పూరీ రథయాత్ర ప్రత్యేక రైలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రథయాత్ర సందర్భంగా పూరీకి వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశాఖపట్నం-పూరీ రథయాత్ర ప్రత్యేక రైలును విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు శ్రీభరత్, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్‌లు శనివారం మధ్యాహ్నం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఈ ప్రత్యేక రైలును ప్రజలు సద్వినియోగం చేసుకోవాన్నారు.

మత్తు కోరల నుంచి చిన్నారులను రక్షించాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మత్తు కోరల్లో చిక్కుకోకుండా చిన్నారులను రక్షించాలని, వారికి బంగారు భవిష్యత్తు అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు పేర్కొన్నారు. పిల్లల్లో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నివారణ అనే అంశంపై ఎంవిపి.కాలనీ పరిధిలోని డిఆర్‌డిఎ ప్రగతి భవన్‌లో వివిధ జిల్లా స్థాయి అధికారులతో శనివారం ఉదయం కమిషన్ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వంటి విషయాల్లో చిన్నారులు భాగస్వామ్యం కాకుండా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు. ఇటీవల ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమావేశాల సారాంశాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. చిన్నారుల జీవితాల్లోకి మత్తు మహమ్మారి చొరబడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగానికి పిల్లలు దూరంగా ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అహర్నిశలూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వసతి గృహాలు, విద్యా సంస్థల్లో విద్యార్థులు చాలా మంది ప్రమాదకరరీతిలో ఉన్నారని, వారి భవితవ్యం గురించి ఆలోచిస్తుంటే ఆందోళనగా ఉందని అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారంపై దృష్టి సారించాలని ఆదేశించారు. పిల్లల్లో మానవతా విలువలు పెంపొందించాలని, మానసిక ధైర్యాన్ని నింపాలని అన్నారు. అధికారులతో పాటు తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎల్లప్పుడూ వారిని ఓ కంట కనిపెడుతూ ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు గొండు సీతారాం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి జి.జయదేవి, దిశా ఎసిపి వివేకానంద, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, డిఇఓ ఎల్.చంద్రకళ, బిసి వెల్ఫేర్ అధికారిణి కె.శ్రీదేవి, ఎస్ఎస్ఎ ఎపిసి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ అప్పారావు

మొదటి పేజీ తరువాయి..

12 పాఠశాలల్లో ఒక్కో టీచరే..!

తగ్గుతున్నాయి.

చాలీచాలని ఉపాధ్యాయులు

1, 2 తరగతులకు తెలుగు, గణితం, ఇతర పాఠ్యాంశాలు, 3, 4, 5 తరగతులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం, ఉన్నత పాఠశాలలో అయితే తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, పిఎస్, ఎన్ఎస్, సోషల్ పాఠ్యాంశాలు బోధించాలి. వాస్తవంగా ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు, యుపి పాఠశాలకు నలుగురుతో పాటు పిఇటి, ఉన్నత పాఠశాలకు హెచ్ఎంతో పాటు తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఉండాలి. ఈ విధమైన నియామకాలు దాదాపు ఏ పాఠశాలలోనూ లేవనే చెప్పాలి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 117 ప్రకారం.. 20 మంది విద్యార్థులకు ఒకే టీచర్ ఉండేలా ఉన్న నిబంధన ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిందనే చెప్పాలి. ఆ జిఒ రద్దయితే మండలంలో 51 టీచర్ పోస్టులను పునరుద్ధరించే వీలుంది. ప్రస్తుతం మండలం, జివిఎంసి ఒకటో జోన్‌లో 100 పాఠశాలల్లో 454 టీచర్ పోస్టులకుగాను 403 మంది టీచర్లు ఉన్నారు. 51 టీచర్ పోస్టులు భర్తీ కాకుండా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం సర్కారు బడుల అభివృద్ధికి ఎటువంటి నిర్ణయం తీసుకోనుందో వేచిచూడాలి.

14న పాలస్తీనా సంఘీభావ సదస్సు

ఖండించిందని పేర్కొన్నారు. తక్షణం ఈ క్రూర యుద్ధోన్మాదాన్ని ఆపాలని ప్రపంచ సమాజం గొంతెత్తి నిరసిస్తోందన్నారు. అయినా అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఈ మారణ హోమాన్ని కొనసాగిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పాలస్తీనీయులకు మద్దతుగా సదస్సు తలపెట్టామని వెల్లడించారు. ప్రజలు, వామపక్ష అభ్యుదయ వాదులు, లౌకికవాదులు, శాంతికాముకులు, కార్మికులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎండి.ఆయూబ్, కోశాధికారి కుజ్ కుహనా, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అబ్దుల్ మునీర్ పాల్గొన్నారు.

సరసమైన ధరలకే నిత్యావసర సరుకులు

ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని డిఎస్ఒ, మార్కెటింగ్ శాఖ ఎడిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటు అధికారులు, అటు వర్తకులు వ్యవహరించాలని, ప్రజలకు సహకరించాలని హితవు పలికారు. ఈ క్రమంలో వర్తకులు వారి సమస్యలను జెసి దృష్టిలో పెట్టారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటామని, లాభాపేక్ష లేకుండా విక్రయాలు జరుపుతామని ఈ సందర్భంగా వర్తకులు పేర్కొన్నారు. సమావేశంలో డిఎస్ఒ సూర్యప్రకాష్, మార్కెటింగ్ శాఖ ఎడి యాసిన్, సివిల్ సప్లై విభాగం ఇతర అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వర్తకుల సంఘం ప్రతినిధులు, ట్రేడర్లు, హోల్‌సేలర్స్, రిటైలర్లు పాల్గొన్నారు.



అతిథులతో క్రీడాకారులు

ఎల్ఐసి ఆధ్వర్యాన క్రీడా ఎంపికలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎల్ఐసి డివిజనల్ స్థాయి అథ్లెటిక్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌ను శనివారం ఉదయం విశాఖపట్నంలోని రైల్వే స్టేడియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎల్ఐసి విశాఖపట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్ హాజరై ప్రారంభించారు. ఈ ఎంపికలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో ఉన్న సుమారు 20 ఎల్ఐసి శాఖల నుంచి 63 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రామారావు, ఎల్ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు సభ్యులు డాక్టర్ డివిఎస్‌వై.శర్మ, క్రీడా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కార్యదర్శి జి.వరప్రసాద్, విఆర్‌కె.మూర్తి పాల్గొన్నారు.

సురభి ప్రదర్శనలు విజయవంతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో జూన్ 29 నుంచి జులై 5 వరకు విశాఖలోని కళాభారతి ఎసి ఆడిటోరియంలో పద్మశ్రీ సురభి బాబ్జీ కళా ప్రాంగణంలో జరిగిన శ్రీ భానోదయ నాట్యమండలి సురభి నాటక వారోత్సవాలు విజయవంతంగా ముగిసినట్టు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం ఎయులోని రంజని గెస్ట్ హౌస్‌లో విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. భానోదయ నాట్యమండలి అధినేత ఆర్.నాగబాబు, ఎంఎస్ఆర్ రంగసాయి నాటక సంఘం అధ్యక్షులు బాదంగీర్ సాయి, పుష్పలత, భాను ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ బాదంగీర్ సాయి ఆలోచన మేరకు తాము విశాఖపట్నం వచ్చి ఉచిత ప్రదర్శనలు ఇచ్చామన్నారు. ప్రజలే పోషకులుగా, సంస్థలే రాజ పోషకులుగా, నగర పెద్దలే మహారాజ పోషకులుగా ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశారన్నారు. విశాఖ వాసుల ఆదరణ తాము మరవలేమని, టీం సభ్యులందరూ చాలా ఆనందంగా తిరిగి తమ ప్రాంతాలకు బయలుదేరారని తెలిపారు. కార్యక్రమంలో నాగబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అటు ఉల్లాసం.. ఇటు విలాపం..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

క్రీస్తు పూర్వం 8వ శతాబ్దానికి చెందిన గ్రీసు కవి హోమర్ చెప్పినట్టుగా 'విజయం అప్పుడప్పుడూ తన స్థానాన్ని మార్చుకుంటూ వుంటుంది'. అన్న దాంట్లో నిజం దాగి వుందనే చెప్పాలి. రాష్ట్ర ప్రజలు 2019 నుంచి ఏకపక్ష తీర్పులు ఇచ్చే పరిస్థితి వెల్లడవుతోంది. వైసిపికి ఘన విజయం కట్టబెట్టిన ప్రజలు, 2024లో పూర్తిగా తిరగబెట్టేశారు. ఒక రకంగా ఓటర్లలో ఇదొక ప్రత్యేక ధోరణే అని చెప్పొచ్చు.. కూటమి పార్టీలకు చెందిన నేతల్లో సహజంగానే నేడు విజయోత్సాహం నెలకొంది. ఐదేళ్లపాటు ఇంకా తమకు తిరుగుండదన్న రీతిలో వారి పరిస్థితి కనిపిస్తోంది.

ఇప్పటికీ రాజకీయ పార్టీల్లో అదే చర్చ

2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి 11 సీట్లు సాధించినా అంతటా దాదాపు తుడిచిపెట్టుకు పోయినట్టే అయ్యింది. తమ అభ్యర్థులకు లభించిన మెజారిటీలతో విశాఖలో కూటమి పార్టీల్లో ఉల్లాసం, ఉత్సాహం కనిపిస్తుండగా, వైసిపి శిబిరాలు వెలవెలబోతున్నాయి. ఇలా జరుగుతుందని తొలుత ఎవ్వరూ ఊహించే స్థితి లేదన్న చర్చ పార్టీల శిబిరాల్లో వెల్లడవుతోంది. వైసిపి నాయకులు పూర్తిగా నైరాశ్యంలో ఉన్నారు. ఎండాడలోని వైసిపి జిల్లా కార్యాలయంలో జరిగే మీటింగులకు సైతం నేతలు మొఖం చాటేస్తున్నారు. ఓటమి చెందిన ఎంఎల్ఎ అభ్యర్థుల్లో ఒక్కసారంటే ఒక్కసారి కూడా కొంతమంది పార్టీ కార్యాలయ ముఖం చూడడం లేదు. ఇలాంటి వారిలో ముత్తంశెట్టి శ్రీనివాస్, ఎంవివి సత్యనారాయణ, ఆడారి ఆనంద్‌కుమార్ ప్రముఖంగా ఉన్నారు. ఇటీవల జరిగిన జిల్లా వైసిపి సమావేశంలో గుడివాడ అమర్‌నాథ్‌ను కొంతమంది స్థానిక వైసిపి నేతలు ప్రశ్నిస్తూ... నాయకుల



తీరు వల్లే వైసిపి రాష్ట్రంలో ఘోర ఓటమి చెందిందంటూ విమర్శలు గుప్పించడంతో సమావేశంలో కాసేపు రసాబాస నెలకొంది.

ఆ సీట్లూ గెలుచుకోలేక...

కూటమి ప్రభంజనంలో వైసిపి విశాఖ జిల్లాలో ఒక్కసీటు కూడా గెలుచుకోలేక చతికిలపడింది. కనీసం దక్షిణం, ఉత్తరం సీట్లు అయినా గెలిచే అవకాశం ఉందని పలువురు భావించినప్పటికీ ఆ రెండూ కూడా గల్లంతయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి అధినేత జగన్‌పైగల వ్యతిరేకత కారణంగా ఈ రెండూ కూడా పోయాయన్న చర్చ నడుస్తోంది. తాజాగా ఈ నెల 8న వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని వైసిపి నేతలు భారీ సన్నాహాల్లో ఉన్నారు. అలాగే ప్రతి బుధవారం ఎండాడ వైసిపి కార్యాలయంలో పార్టీల్లో పదవులున్న నాయకులు కార్యకర్తల సమస్యలు వినేందుకు అందుబాటులో ఉండాలని వైసిపి అధిష్టానం నిర్ణయించినట్లు తెలుస్తోంది. జివిఎంసి మేయర్, ఎంఎల్‌సి, జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థాయి నేతలు విశాఖ జిల్లా పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉండేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

కూటమికి సానుకూల అంశం

విశాఖ జిల్లా అభివృద్ధిపై దృష్టిపెట్టేందుకు కూటమి పార్టీలు మూడింటికీ ఇదే సరైన అవకాశం. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుని, మోడీపై ఒత్తిడి తేవడానికి సైతం సానుకూల పరిస్థితులున్నాయి. కేంద్రంలో మోడీ ప్రభుత్వం టిడిపిపై ఆధారపడి ఉండడం గతంలో ఎన్నడూ జరగలేదు. ఇదే సరైన అవకాశమని పలువురు భావిస్తున్నారు.

కెజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన 24 ఏళ్ల అరుణ కుమారి రెండో గర్భం దాల్చి ఏడో నెలలో రక్త పరీక్షలు చేయించుకుంది. తీవ్రమయిన బ్లడ్ క్యాన్సర్ అని శ్రీకాకుళంలో నిర్ధారించి, వెంటనే కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. కెజిహెచ్‌లోని మెడికల్ ఆంకాలజీ విభాగంలోని కాన్సర్ వైద్యనిపుణులు ఆమెకు సకాలంలో ఆరోగ్య శ్రీలో తగిన వైద్యం చేశారు. 9వ నెలలో ప్రసూతి వైద్యులు ఆమెకు సిజేరియన్ చేశారు. మగ బిడ్డకు అరుణకుమారి జన్మనిచ్చింది. ఈ విషయాలను కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద శనివారం గైనిక్ విభాగంలో తల్లి, శిశువును పరామర్శించిన అనంతరం మీడియాకు వివరించారు. కెజిహెచ్‌లో వైద్య సేవలు పట్ల తల్లి అరుణ ఎంతగానో ఆనందం వ్యక్తపరిచింది. రక్తకణాల క్యాన్సర్‌తో తల్లీ బిడ్డ సురక్షితంగా కోలుకోవడం చాలా అరుదైన సంఘటన అని డాక్టర్ శివానంద హర్షం వ్యక్తం చేశారు. మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్ప, గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సౌమిని, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ షర్మిల, నర్సింగ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజలతో ఉంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు దక్షిణ నియోజవర్గంలో వాడవాడలా నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇన్‌ఛార్జి వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. ఆశీల్‌మెట్ట కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణులతో ఆయన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటల నుంచి వివిధ సేవా కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. వైసిపి మళ్లీ ప్రజల పక్షాన నిలబడుతూ కొత్త ఉత్సాహంతో ముందుకు వెళ్లనుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండా రాజీవ్ గాంధీ, డాక్టర్ మూగి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు తోట పద్మావతి, కొండమ్మ, కోడిగుడ్ల శ్రీధర్ పాల్గొన్నారు.

విక్టోరియా ఆసుపత్రిని ఆధునికీకరిస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలోని గవర్నమెంట్ విక్టోరియా హాస్పిటల్ (ఘోసాసుపత్రి)ని ఆధునికీకరించి, అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విక్టోరియా హాస్పిటల్‌లో పర్యటించారు. సూపరింటెండెంట్, సిబ్బందిని కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

'ఎల్‌విపి'లో ఇన్ఫోర్ మయోపియా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ ఎన్‌ఫోర్ సహకారంతో హనుమంతవాక జంక్షన్‌లోని ఎల్‌వి.ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థ జిఎంఆర్ వరలక్ష్మి క్యాంప్‌లో మయోపియా కేంద్రాన్ని శనివారం ముఖ్య అతిథులు గీతం యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ రాజా, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ప్రొఫెసర్ పి.పుష్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎంఆర్‌వి క్యాంపస్ అధినేత డాక్టర్ వీరంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఎల్‌విపిఇఐ క్యాంపస్‌లో మొట్టమొదటి సారిగా ఈ సదుపాయాన్ని ఏర్పాటుచేయగా, తరువాత ఎన్ఫోర్ భాగస్వామ్యంతో విశాఖలో మూడవ కేంద్రంగా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. దగ్గరగా ఉన్న వస్తువులు సరిగ్గా కనిపించక పోవడం వంటి మయోపియా సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు, యువకులకు ఈ కేంద్రం ఎక్కువగా ఉపయోగపడుతుందన్నారు. ఇన్ఫోర్ సెంటర్ నెట్ వర్క్ హెడ్ డాక్టర్ పవన్ వర్మిచర్ల మాట్లాడుతూ, వ్యాధి నియంత్రణ కోసం సంపూర్ణ చికిత్సను అందించడానికి అత్యాధునిక సాంకేతికతను ఈ కేంద్రం కలిగి ఉందన్నారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఇన్ఫోర్ మయోపియా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

నేరాలు ఘోరాలు

పరారీలో ఉన్న గంజాయి నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -గొలుగొండ: 2017లో 106 కిలోల గంజాయి రవాణాలో నిందితుడిగా ఉండి, పరారిలో ఉన్న అల్లూరి జిల్లా గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డ గ్రామానికి చెందిన జడ్డు నాగరాజును శనివారం పట్టుకున్నట్లు కేడీపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. ముద్దాయిని కోర్టు ఆదేశాల మేరకు విశాఖపట్నం సెంటర్ జైలుకు రిమాండ్‌కు తరలింస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో గంజాయి రవాణా, అసాంఘిక కార్యక్రమాల సమాచారం తెలిస్తే పోలీసులకు 9440904240 ఫోన్ నెంబర్‌కు సమాచారమిచ్చి సహకరించాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

మాజీ సైనికుడు మృతి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు బోను శ్రీను శుక్రవారం మృతిచెందారు. శనివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. బోను శ్రీను 1986లో విలాస్‌ఖాన్ పాలెంలో జన్మించారు. విద్యాభ్యాసం అనంతరం ఆర్మీలో చేరారు. ఉద్యోగ విరమణ పొందారు. తక్కువ వయసులోనే మృతిచెందడంతో తీవ్ర దు:ఖంలో మునిగిపోయారు. తండ్రి సూరినాయుడు, తల్లి పైడిరాజు దంపతులకు రెండవ పుత్రుడుగా జన్మించాడు. శ్రీను అన్నయ్య రమేష్ ప్రస్తుతం ఆర్మీలో సైనికునిగా పనిచేస్తున్నారు.

ఆనందపురంలో కల్కి బుజ్జి సందడి

ప్రజాశక్తి-ఆనందపురం : ఇటీవల విడుదలైన కల్కి 2898 ఏడి మూవీలో రెబల్ స్టార్ ప్రభాస్ ఉపయోగించిన బుజ్జి వాహనాన్ని ప్రజల సందర్శనార్థం ఆనందపురం మండలం వెల్లంకిలోని గోకార్టింగ్ వద్ద మూవీ యూనిట్ ఉంచింది. ఈ వాహనాన్ని చూసేందుకు ప్రభాస్ ఫ్యాన్స్, విద్యార్థులు క్యూ కట్టారు. దీని ఖరీదు రూ.7 కోట్లు. ఇది గంటకు 40 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. వీక్షకులను అలరించింది.



ఆనందపురంలో కల్కి బుజ్జి

దుర్వాసన రాకుండా చర్యలు



శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇతర సిబ్బందితో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు చిట్టివలస పెద్దచెరువు ద్వారా దుర్వాసన రాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. చెరువు ద్వారా వస్తున్న దుర్వాసన వల్ల చుట్టుపక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్ట సురేష్ శనివారం జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆమె వెంటనే స్పందించి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు, ఇతర అధికారులతో కలిసి సంబంధిత చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువులో నిల్వ ఉన్న మురుగు నీటిని అవుట్ ఫ్లో ద్వారా బయటకు పంపించారు. చెరువులో నీరు నిల్వ ఉండకుండా, దుర్వాసన రాకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సెక్రటరీలు, టిడిపి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాల ప్రాంగణంలో ఉన్న సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వరరావు ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గంప నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుపట్ల, ప్రవర్తనలో ఉన్న భయాన్ని పోగొట్టి వ్యక్తిగత వికాసంపై పలు సూచనలు చేశారు. విద్యార్థి దశలో కాలానికి అనుగుణంగా వారి సృజనాత్మకకు వెలికి తీయగలిగితే అద్భుతాలు జరుగుతాయని, నేటి విద్యార్థులు భావి భారతదేశానికి దిశా నిర్దేశకులని పేర్కొన్నారు. తప్పటడుగులు వేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాల్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.మహేశ్వరరావు, విభాగతిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'రవీంద్రభారతి'లో వనమహోత్సవం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలోని రవీంద్రభారతి గ్లోబల్ పాఠశాలలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాపాధ్యాయులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, మానవ మనుగడకు చెట్లు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ఈ విషయం పిల్లల ద్వారా వారి తల్లిదండ్రులకు చేరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిజిఎం వసంత, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి వెంకటేష్‌నాయుడు, జిఎం రమ్య, డీన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలంలోని దాకమర్రి, మజ్జిపేట గ్రామాల్లో వరి పంట పొలాలను పిఎండిఎస్ రీజనల్ అధికారి ప్రకాష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వరి సాగులో అనుసరించాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు. 18 రకాల విత్తనాలను పచ్చి రొట్ట ఎరువులుగా వేసిన 45 రోజుల తర్వాత దమ్ము పడితే భూమి సారవంతంగా మారుతుందని తెలిపారు. తద్వారా వరి పంటలో అధిక దిగుబడులు సాధించ వచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మజ్జిపేట సర్పంచ్ మజ్జి సూరినాయుడు, పిఎండిఎస్ మండల ఇన్‌ఛార్జి జయరాం తదితరులు పాల్గొన్నారు.

234 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్ ఆవరణలో గంటా శారద హెల్పింగ్ హ్యాండ్స్, నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ సుచిత్ర, ఆసుపత్రి సిబ్బంది 234 మందికి పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ సందర్శించారు. ఈ కార్యక్రమంలో నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు, కొప్పల రమేష్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వి.శ్రీనివాసరెడ్డి, ఎన్‌సిసి విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణాపురం సచివాలయానికి ఫ్యానుల వితరణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామ సచివాలయానికి మూడు సీలింగ్ ఫ్యాన్లను స్థానిక టిడిపి నాయకులు సుంకర అచ్చంనాయుడు వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొకర అప్పలనాయుడు (అన్నమయ్య), బొడ్డు శ్రీను, సిహెచ్.ఆచారి, మొకర శ్రీను, మొకర అప్పలరాజు (బంక్) పాల్గొన్నారు.

ఘనంగా బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి

ప్రజాశక్తి-యంత్రాంగం

భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పలుచోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు.

మధురవాడ: ఎండాడలోని వైసిపి జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అల్లంపల్లి రాజబాబు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జి.రవిరెడ్డి, పెడాడ రమణికుమారి, మొల్లి అప్పారావు, పేర్ల విజయ్‌చంద్ర, మారుతి ప్రసాద్, అప్పన్న, వనపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వేములవలసలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. దేశానికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవను కొనియాడారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఉప్పాడ సీతారాం, మండల బిజెపి అధ్యక్షులు మీసాల రాము నాయుడు, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు పరిధి లక్ష్మీనగర్, బాజీ సంక్షన్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే గణబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్ బొమిడి రమణ, నాయకులు కెవి.బాలసుబ్రహ్మణ్యం, నరిపిన్ని సత్తిరాజు, యలమంచిలి ప్రసాద్, నరవ అనూష , నరవ పైడిరాజు, శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జివిఎంసి డిప్యూటి మేయర్ కటుమూరి సతీష్ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, శోభన్‌బాబు, సుకుమార్, కనకరాజు, కె.చిన్నా, బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం : ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బంది బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి, డైరెక్టర్ ఫైనాన్స్ డి.చంద్రం, చీఫ్ జనరల్ మేనేజర్లు బి.రామచంద్రప్రసాద్, ఎం.రామకృష్ణ, జె.శ్రీనివాసరావు, ఎస్.మసిలమణి, ఎస్.హరిబాబు, ఎన్‌వి.రమణమూర్తి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు. 36వ వార్డు రంగిరీజు వీధి శ్రీ నూకాలమ్మ ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాయకరావుపేట: దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రావ్ వర్ధంతిని స్థానిక చిత్రమందర థియేటర్ వీరాంజనేయ రిక్షా సంఘం సెంటర్ వద్ద నాయకులు చలికే గోవిందరావు, ఆరుగుల అప్పలకొండ, మంజులూరి దుర్గాప్రసాద్, ఆధ్వర్యంలో నిర్వహించారు బాబూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు తుమ్మలపల్లి కుమార్, సలికే గోవిందరావు, ఎమ్మార్పీఎస్ గౌరాధ్యక్షులు తుమ్మలపల్లి లక్ష్మణరావు పట్టణ అధ్యక్షులు ఇండు గుపల్లి రమణ, మసురుపా మని తల్లి, పిల్లి కష్ణ, కాపారపు సత్యనారాయణ, మసురుపా తలుపులు పాల్గొన్నారు.

చీడికాడ : అరుంధతి సేవా సంఘం, మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షులు రావాడ దేముడు నాయుడు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు.మాదిగ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు,ఎంపీటీసీ రావాడ మని, పెదపూడి సూర్యం, రావాడ నాగమ్మ , రావాడ కన్నమ్మ. రావాడ విశ్వేశ్వరమ్మ. పెంకి కేశమ్మ, ఐనెల్లి కొండమ్మ, వేప చేదు మరియమ్మ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : చెట్టుపల్లి ఎంపీపీ పాఠశాలలో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నసేన రూరల్ అధ్యక్షులు చక్రవర్తి, కాపు సంఘ అధ్యక్షులు, ఈ.రమణ, భవన నిర్మాణ కార్మిక అధ్యక్షులు పసుపులేటి అప్పలనాయుడు, ట్రేడ్ యూనియన్ నాయకులు మోపాడు సత్యప్రసాద్, రెల్లి సంఘం నాయకులు మామిడి అర్జున్, పొట్నూరు గోవింద పాల్గొన్నారు.

అనకాపల్లి : అరుంధతి నగరంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ దేశంలో అంటరాని వారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దళిత తేజం జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో మల్లా శివన్నారాయణ, విల్లూరి రమణబాబు, దొడ్డి జగదీష్, సారిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. బిఎస్‌పి అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సూదికొండ మాణిక్యాలరావు ఆధ్వర్యంలో చోడవరం బస్టాప్ వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పెట్ల నాగేశ్వరరావు, కొల్లి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట గుర్రం జాషువా కాలనీలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి స్థానిక నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి వేగి గోపికృష్ణ, నాయకులు సిద్ధిరెడ్డి శీను, తాకాశి కృష్ణ, కాండ్రేగుల సతీష్, వేగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సతీష్



అనధికార నిర్మాణాన్ని తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

అనధికార నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ పరిధి విశాఖ శారదా పీఠం సమీపంలో అనధికారికంగా నిర్మిస్తున్న భవనాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా టిపిఎస్ తేజేశ్వరరావు మాట్లాడుతూ, అనధికారికంగా భవనం నిర్మిస్తున్నరని వచ్చిన ఫిర్యాదు మేరకు ఎసిపి రఘునాథరావు ఆదేశాలతో వచ్చి పరిశీలించినట్లు తెలిపారు. అనధికారికంగా నిర్మిస్తున్నట్లు గుర్తించి పాక్షికంగా తొలగించారు. అన్ని అనుమతులూ పొంది, ప్లాన్ తీసుకొని నిర్మించాలని కోరారు. లేకుంటే చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ప్లానింగ్, జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

గీతం డిగ్రీ, పీజీ సైన్స్ కోర్సుల అడ్మిషన్లు
- 14న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 14వ తేదీన గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహించనున్నట్లు స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి తెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ప్రవేశ పరీక్షకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 4 సంవత్సరాల బిఎస్సీ (ఆనర్స్) కోర్సులు, 3 సంవత్సరాల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 2 సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు ఉందని తెలిపారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బిఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని, ఈ కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వివరాల కోసం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. గ్యాట్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోదలచిన వారు గీతం వెబ్ సైట్‌ను పరిశీలించవచ్చున్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రభుత్వ ఉమ్మడి ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన వారు, క్యాట్, జెఇఇ వంటి జాతీయ స్థాయి పరీక్షలలో ఉత్తీర్ణత పొందిన వారు తమ ర్యాంక్ కార్డులతో నేరుగా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ప్రతిభ గల విద్యార్థులకు గీతం స్కాలర్‌షిప్‌లను అందిస్తుందని చెప్పారు.

నూతన విద్యా విధానంలో భాగంగా నిర్వహిస్తున్న 4 సంవత్సరాల బిఎస్సీ డిగ్రీ కోర్సు పూర్తి చేసిన వారు నేరుగా పిహెచ్‌డి కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని డీన్ ప్రొఫెసర్ కృష్ణ తెలిపారు. డిగ్రీ కోర్సు నుంచి నేరుగా పరిశోధక విద్యార్థిగా మారే క్రమంలో విద్యార్థులకు అత్యున్నత ప్రయోగశాలలో పనిచేసే అనుభవం ఉపయోగపడుతుందన్నారు. ఈ కారణంగా గీతంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రత్యేక ప్రయోగశాలలు నెలకొల్పామని చెప్పారు. సెంట్రల్ రీసెర్చ్ ల్యాబ్స్, మూర్తి ల్యాబ్స్ విద్యార్థులకు అంతర్జాతీయ పరిశోధనశాలలపై అవగాహన పెంచుకునేందుకు ఉపయోగపడతాయన్నారు.

అన్న క్యాంటీన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -తగరపువలస : తగరపువలస జంక్షన్‌లో జివిఎంసి నిధులు రూ.16 లక్షలతో చేపట్టిన అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, ఎఇ ఎ.సుమన్, వివిధ విభాగాల అధికారులు, టిడిపి నాయకులు చిక్కాల విజయబాబు, ఎంవి.గురుమూర్తి, కొప్పల రమేష్, పిట్ట సురేష్, గిడుతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలమవుతున్నా... పనులు చేయించుకోలేం

పంచగ్రామాల ప్రజల ఆవేదన

ప్రజాశక్తి-పెందుర్తి : ఇళ్లు శిథిలమవుతున్నా కనీస మరమ్మత్తు పనులు కూడా చేయించుకోలేకపోతున్నామని పంచ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి ఎన్నికలో పంచ గ్రామాల సమస్య ప్రధాన ఎజెండాగా ఉంటోంది. అన్ని పార్టీల నాయకులు ఎన్నికల ముందు హామీలిస్తున్నారు తప్ప పరిష్కారం చూపడంలేదని వాపోతున్నారు. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యతో పంచ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్న నాగరాజు ఇంటి స్లాబు పెచ్చులు పడిపోయాయి. ఆ ఇంటిలో ఉంటున్న వృద్ధులు, వికలాంగులు భయాందోళనకు గురయ్యారు. గత ప్రభుత్వంలో చిన్న చిన్న మరమ్మత్తులకు అవకాశం ఇచ్చారు. ఈ ఇంటిని మరమ్మత్తులు చేయడానికి పనికిరాదని, పూర్తిగా తొలగించి మళ్లీ నిర్మాణం చేపట్టాలని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. దీంతో ఏమి చేయాలో తోచక ఇంటి యజమాని సతమత మవుతున్నారు. పంచ గ్రామాల్లో ఉండటమే మా తప్పా అని ప్రశ్నిస్తున్నారు.



ఒక ఇంటిలో పెచ్చులూడుతున్న స్లాబ్

శిథిలమవుతున్న ఇళ్లను నిర్మించుకోడానికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు

రాజ్యాంగ పీఠికను మననం చేసుకోవాలి



భారత రాజ్యాంగ పీఠిక పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న శ్రీధర్

ప్రజాశక్తి-సీతమ్మధార : భారత రాజ్యాంగ పీఠిక అంటే ఏమిటో ప్రతి ఒక్కరూ చదివి మననం చేసుకోవాలని పూర్వ కేంద్ర సమాచార కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ సూచించారు. పౌర ప్రజాసంఘాల వేదిక ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన శనివారం శ్రీధర్ రాసిన "భారత రాజ్యాంగ పీఠిక" పుస్తకాన్ని లీడర్ పత్రిక సంపాదకుడు వివి రమణమూర్తి ఆవిష్కరించారు. నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు వి.అంజిరెడ్డి పుస్తకాన్ని సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీధర్ మాట్లాడుతూ, మనం రూపొందించుకుని ఆమోదించుకున్న రాజ్యాంగం అమలులోకి వచ్చి 77 ఏళ్ల గడిచినా హక్కుల గురించి ఎవరు మాట్లాడినా దేశద్రోహులు అని పాలకులు అనడం పరిపాటిగా మారిందన్నారు. స్వతంత్ర, ఘనతంత్ర దినోత్సవం నాడు మాత్రమే గుర్తు చేసుకొని తరువాత పక్కన పెడుతున్నారని చెప్పారు. ప్రజలు భావాలను స్వేచ్ఛగా మాట్లాడడానికి కూడా అర్హత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట సభలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు రాజ్యాంగం మీద ప్రమాణం చేసి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో ప్రజలందరికీ సరళమైన భాషలో అర్థం అయ్యేటట్లు రాశానని, మన హక్కులు కాపాడుకోవడానికి పుస్తకం ఉపయుక్తమైతే మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీ వేత్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి -యంత్రాంగం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నగరంలో పలుచోట్ల శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిది త్రినాథపురంలో యుసిడి సీవో ఇఫ్తాకర్ భాను ఆధ్వర్యాన సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. 62వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మజ్జి మాలినాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్‌గునియా తదితర సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటిలోపల, పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు, ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నీలాపు జోగి, నీలం రాజు, ధూపాన రామారావు, లక్ష్మి, మలేరియా సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, సచివాలయ మహిళా పోలీస్ సునీత, ఆర్పీ సంధ్య, ఆశా కార్యకర్త జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ యశోద పాల్గొన్నారు.

ఆనందపురం : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గంగునాయుడు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు -తీసుకోవాల్సిన జాగ్రత్తల'పై శనివారం ఆయన మాట్లాడారు. వర్షా కాలం సీజన్లో ఎక్కువగా వచ్చే దగ్గు, జలుబు, గొంతు నొప్పి, జ్వరాలు, ముఖ్యంగా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, విరోచనాలు, కడుపునొప్పి తదితరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే వెంటనే పిహెచ్‌సిలో వైద్య సిబ్బందిని సంప్రదించి పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని డాక్టర్ గంగునాయుడు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేలా బోధన : యుటిఎఫ్

ప్రజాశక్తి- గాజువాక : ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేలా విద్యాబోధన ఉండాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు టి.అప్పారావు, జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గాజువాక మండలశాఖ ఆధ్వర్యాన శనివారం అక్కిరెడ్డిపాలెం, మింది, గాజువాక, కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, నాతయ్యపాలెం, రాంనగర్, చట్టివానిపాలెం, డ్రైవర్స్ కాలనీ, శ్రీనగర్, సుందరయ్యకాలనీ, కర్ణవానిపాలెం, చిన్నగంట్యాడ, శ్రామికనగర్, కొత్త గాజువాక, మింది, అక్కిరెడ్డిపాలెం, ఇందిరాకాలనీ, భానోజీకాలనీలోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల నుంచి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు చేశారు. పాఠశాల అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ చేపడుతున్న అంశాలను ఉపాధ్యాయులకు యుటిఎఫ్ నాయకులు వివరించారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేలా విద్యా బోధన ఉండాలని చెప్పారు. యుటిఎఫ్ ఆవిర్భావమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబర్‌లో కాకినాడలో జరిగే స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దాసరి అబ్రహంలింకన్, మండల నాయకులు కె.చెల్లారావు, రవికుమార్, డి.నూకరాజు, విజయకుమారి, నూకరాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

వెలగని వీధిలైట్లు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సత్యనగర్‌లో 10 బి/1/6 నెంబర్ స్తంభం వీధిలైటు కొద్ది నెలలుగా వెలగడం లేదు. ప్రజలకు నేరుగా సేవలు అందాలని గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినా కనీసం పట్టించుకునే వారే కరువయ్యారు. ఎన్నికల ముందునుంచీ పనిచేయడంలేదు. ఎన్నికలయ్యాక కూడా సిబ్బంది ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ ప్రాంతంలో రాత్రిపూట తిరగాలంటే వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలకు రోడ్డు కూడా అధ్వానంగా మారడం, వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక కార్పొరేటర్, అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని సత్యనగర్ కాలనీవాసులు కోరుతున్నారు

పుట్టుకతో వచ్చే లోపాలపై శిక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : పుట్టుకతో వచ్చే లోపాలపై అన్ని ఆసుపత్రుల స్పెషలిస్ట్ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, సిహెచ్‌ఒలు, స్టాఫ్ నర్సులు, సూపర్వైజర్లకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో వారం రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ శిక్షణలో పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించుట, తలనుంచి పాదాలవరకు చేసే పరీక్ష విధానం, అప్పుడే పుట్టిన నవజాత శిశువు వయసు నుంచి అంగన్వాడీ విద్యార్థుల వరకు పరీక్షలు నిర్వహించి పోషకాహార పెరుగుదల లోపాలు, జన్యు పరమైన లోపాలు, వైకల్యం, బరువు తక్కువ పిల్లలు, నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు, మెల్ల కన్ను, పెదవి, అంగటి చీలిక, కంటి శుక్లాలు, వినికిడి లోపాలు, గుండె సంబంధిత వ్యాధులు తదితరాలను గుర్తించి సత్వర చికిత్స అందించుట లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్‌వి.సమత, డాక్టర్ బి.సంధ్యా రాణి, డాక్టర్ సాయి కిరణ్, శాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

52వ వార్డులో జియ్యాని పర్యటన

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి గౌరీనగర్ రిక్షాకాలనీలో అధికారులతో కలిసి నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శనివారం పర్యటించారు. కాలనీలోని సమస్యలపై స్థానికుల ఫిర్యాదు మేరకు వార్డును సందర్శించారు. గౌరీనగర్‌లో నిర్మాణంలో ఉన్న నూతన పారిశుధ్య కార్యాలయం, వార్డు సచివాలయ భవనాల పనులు పరిశీలించారు. గౌరీనగర్ పార్క్, జెఎన్ఎన్‌యుఆర్ఎం, టిడ్కో గృహాల సమస్యలపై అధికారులతో శ్రీధర్ చర్చించారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఇలు ఇమాన్యుల్, అర్చన, ఉష, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సన్యాసప్పారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- సిపిఎం నాయకులు రాము
- డయేరియా బాధితులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని సిపిఎం అచ్యుతాపురం డివిజన్ కన్వీనర్ ఆర్ రాము డిమాండ్ చేశారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న డయేరియా వ్యాధిగ్రస్తులను శనివారం ఉదయం ఆయన పరామర్శించారు. వారికి పార్టీ తరుపున ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం డయేరియా ప్రబలిన మోటూరు పాలెం గ్రామాన్ని సందర్శించారు. అక్కడ డ్రైనేజీలను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. రహదారులపై మురుగునీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. గ్రామ పరిసరాలలో దోమల వృద్ధి విపరీతంగా పెరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రక్షిత మంచినీరు అందించాలని, గ్రామ పరిసరాలు, డ్రైనేజీలను మెరుగుపర్చాలని, దోమలు నివారణకు ఫాగింగ్ చేయాలని, డయేరియాతో అస్వస్థత గురైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కూండ్రపు సోమునాయుడు, కోటి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్న సిపిఎం నేతలు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన కొత్త ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ సిఐ పి పైడపునాయుడు శనివారం నాలుగు రోడ్ల కూడలి, రింగ్ రోడ్డు జంక్షన్ ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ట్రాఫిక్ నియమ నిబంధనలను అనుసరిస్తూ మెలగాలని సూచించారు. గతంలో ఉన్న నిబంధనలు ఇప్పటి నిబంధనలకు ఉన్న బేధాన్ని వివరించారు. చట్టాలను అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడిపే వారికి ఎర్ర గులాబీలు ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

బిఎస్‌పి నేత హత్య నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : బహుజన్ సమాజ్ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు ఆర్మ్ స్ట్రాంగ్‌ను దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ వద్ద గల బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆర్మ్ స్ట్రాంగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూదికొండ మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఒక నాయకుడికి రక్షణ కల్పించ లేకపోతే తమిళనాడు రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయలున ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని మాణిక్యాలరావు డిమాండ్ చేశారు.

ఎంపీ సిఎం.రమేష్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని నూకాంబిక గుడి వద్ద సత్యా గ్రాండ్ ఏసీ ఫంక్షన్ హాల్‌లో శనివారం అనకాపల్లి నియోజకవర్గ కూటమి ఆత్మీయ సమావేశం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేష్‌ని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బుద్ధ నాగ జగదీష్, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర, ద్వారపురెడ్డి జగదీశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జయంతికి ఏర్పాట్లు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈ నెల 8న వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలకు విస్తృత ఏర్పాటు చేస్తున్నట్లు వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మందపాటి జానకిరామరాజు, గున్నయ నాయుడు, జాజుల రమేష్, బొడ్డేడ శివ, మలసాల కిషోర్, ఆళ్ళ నాగేశ్వరావు, కెయం నాయుడు, కడిమిశెట్టి సతీష్, మునూరు శ్రీను, పెతకంశెట్టి జోసెఫ్, నమ్మి గణేష్, నడిశెట్టి మధు ఇతర నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-అనకాపల్లి : మేజర్ గ్రామపంచాయతీ తుమ్మపాల అంబేద్కర్ కాలనీ (ఎస్సీ కాలనీ)లో రూ.9 లక్షలు మండల పరిషత్తు నిధులతో నిర్మించనున్న సిసి డ్రైనేజీల పనులకు గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి చంటి, మాజీ సర్పంచ్ కర్రి బాబి, వార్డు మెంబర్లు రవ్వ భవాని శ్రీను, జర్రిపోతుల శ్రీలక్ష్మి, తర్రా సత్యారావు, సింహాచలం, స్థానిక నాయకులు కంకణాల రాజు బాబు, పడాల గణపతి, ఆర్టీసీ సత్యనారాయణ , పల్లెల గణేష్ , కొత్తపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

సజావుగా ఉచిత ఇసుక సరఫరా

కలెక్టర్ విజయ కృష్ణన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ విధానంలో ఇసుక ఉచిత సరఫరా చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఉచిత ఇసుక పంపిణీ విధానం, తదితర అంశాలపై శనివారం విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుండి వర్చ్యువల్ విధానం ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్‌పి కెవి.మురళీకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఎఎస్‌పి విజయభాస్కర్, డిఆర్ఒ శ్రీనివాసరావు, అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికృష్ణ, భూగర్భ గనుల శాఖ సహాయ సంచాలకులు సుబ్బారాయుడు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద, ఇసుక రవాణాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఉండేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిరంతరంగా పోలీస్ పర్యవేక్షణ ఉండేటట్లు చూడాలని ఎస్‌పిని కోరారు. ఇసుక రవాణా కొరకు వినియోగదారులకు అవసరమైన పర్మిషన్లు, బిల్లులను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

10న ధర్నాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి

కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై అఖిల భారత పిలుపులో భాగంగా జులై 10న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ధర్నాలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ సర్కిల్స్‌లో కార్మికుల్లో ధర్నాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ని రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మికుల సమగ్ర చట్టం చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. స్కీముల్లో పనిచేస్తున్న ఆశ, అంగన్వాడి, ఐకెపి, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అజయ్, బాలరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని పట్టణ సీఐ శంకర్రావు పేర్కొన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ టాపర్ విద్యార్థులకు శనివారం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. కీర్తిశేషులు బర్నికాన కన్నారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు మురళీకృష్ణ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకరరావు మాట్లాడుతూ నేటి మేధావులు, మహనీయులు, ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాల విద్యాభిసించి ఉన్నత శిఖరాలను అవరోధించారని తెలిపారు. ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ఉన్నత వెలుగుతో కూడుకున్న విద్య దొరుకుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చిన్ని యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, బొడ్డు సోమరాజు, కళాశాల ప్రిన్సిపల్ రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలంటీరు వ్యవస్థపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

ప్రజాశక్తి - అనకాపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాదిమంది వాలంటీర్లను ప్రభుత్వం ఏమి చేయాలనుకుంటుందో, వాలంటీర్ వ్యవస్థ మీద ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని బిఎస్‌పి అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ సూదికొండ మాణిక్యాలరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమిలో ప్రధానపక్షం తన ఎన్నికల హామీలో వాలంటీర్లను కొనసాగిస్తామని, నెలకు పదివేల రూపాయలు జీతం చెల్లిస్తామని హామీ ఇవ్వగా, మరోపక్షం జనసేన అధినేత ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత కూడా వాలంటీర్లకు వ్యతిరేకంగా అనేక ఆరోపణలు చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో వాలంటీరు వ్యవస్థపై స్పష్టం ఇవ్వాలని కోరారు.

లాలం భాస్కరరావు ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి- అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు లాలం భాస్కరరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ భాస్కర్‌రావు ఎలమంచిలి నియోజకవర్గంలో టిడిపికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. నాగ జగదీష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపట్ల నిరంతరం పనిచేసేవారన్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన భాస్కరరావు మన మధ్యన లేకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏపిఎం సత్యనారాయణ, దాడి ముసిలి అప్పారావు, మద్దాల దొరమ్మ నాయుడు, బోడి వెంకటరావు, మల్లా శివన్నారాయణ, చదరం శివ అప్పారావు, సారిపల్లి శ్రీనివాసరావు, పెంటకోట శివ ప్రసాద్, బల్లమ్మ, మల్ల శ్రీను పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం అగ్రిమరిచెట్టు వద్ద ఉన్న జగన్నాథ్ స్వామివారి దేవస్థానం మండపంలో ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సకల దేవతల్లోనూ జగన్నాథుడికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ మాట్లాడుతూ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు. ఉత్సవ్ కమిటీ చైర్మన్ దాడి వరాహ శివ సూర్యనారాయణ బుజ్జి (వైభవ్), డైరెక్టర్లుగా బొండా రమేష్, అనకాపల్లి మోహన్ రావు, బొడ్డేడ వెంకట చలపతిరావు, కాండ్రేగుల వెంకట వీర అప్పారావు, బుగత కోటేశ్వరరావు, యల్లమల్లి ధనలక్ష్మి, బుద్ధ లక్ష్మీ అప్పారావు, శరగడం కృష్ణ చేత ఆలయ పండితులు సత్తిబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, టిడిపి నాయకులు డాక్టర్ కెకెవిఎ.నారాయణరావు, మళ్ల సురేంద్ర, కొణతాల రత్నకుమారి, పీలా నాగ శ్రీను, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, బిఎస్ఎంకె జోగి నాయుడు, పెతకంశెట్టి వెంకట్రావు, కొణతాల అప్పలరాజు, మాదంశెట్టి నీల బాబు, భీశెట్టి తమ్మునాయుడు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాలకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్డీఏ కూటమి ఎన్నికల హామీలో భాగంగా వికలాంగుల పింఛన్ రూ.3వేల నుంచి 6వేల రూపాయలకు పెంచడం పట్ల శనివారం మూగ చెముడు యూనియన్ నాయకులు స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణను సత్కరించారు. పెంచిన పింఛన్ డబ్బులను నేరుగా ఇంటికి తెచ్చి ఇవ్వటం పట్ల నియోజకవర్గంలో ఉన్న మూగ, చెవిటి యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కుళాయి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని కూండ్రం గ్రామంలో ఇంటింటికి కుళాయిలు నిర్మించే కార్యక్రమానికి హైస్కూల్ దగ్గర, గొల్లపేటలో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందారపు లక్ష్మి సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు జెట్టి అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ వారాది సన్యాసమ్మ నాయుడు, టిడిపి మండల నాయకులు పచ్చికూర రాము, మరపురెడ్డి సత్యనారాయణ, గ్రామ పెద్దలు గంటా తాతయ్య నాయుడు, శానాపతి మున్సబునాయుడు, శానాపతి పోతురాజు పాల్గొన్నారు.

గోదావరి టైటాన్స్ గెలుపు

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-3లో భాగంగా పిఎం.పాలెం క్రికెట్ స్టేడియంలో శనివారం మధ్యాహ్నం గోదావరి టైటాన్స్, బెజవాడ టైగర్స్ జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో రెండు పరుగుల తేడాతో గోదావరి టైటాన్స్ విజయం సాధించింది. ఘనంగా ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన బెజవాడ టైగర్స్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ బరిలోకి దిగిన గోదావరి టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 225 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన బెజవాడ టైగర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల కోల్పోయి లక్ష్యానికి చేరువలో 224 పరుగులు చేసి ఓడిపోయింది.

ఉన్నతాధికారుల దృష్టికి మండల సమస్యలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామానికి చెందిన సబ్ డివిజన్ రిజర్వేషన్ కమ్యూనిటీ భీమిలి డివిజన్ సభ్యులు జలగడుగుల శ్రీను శనివారం మండల స్థాయి సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల బదిలీలు జరిగి జిల్లాకు కొత్త అధికారులు వచ్చిన సందర్భంగా ఆయన వినతులు అందించారు. మండల స్థాయి అధికారుల పనితీరును ఉన్నతాధికారులకు తెలియజేశారు. భూ సమస్యలు, అభివృద్ధిని వివరించారు. జిల్లా కలెక్టర్‌ను, ఎసిపిని కలిసి సమస్యలను వివరించారు.

ప్రకృతి వ్యవసాయ కార్మికుల సమ్మె

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్



ప్రకృతి వ్యవసాయ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు 17 నెలలుగా ఉన్న జీతం బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయం వద్ద శనివారం కార్మికులు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ గత 8సంవత్సరాలుగా కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్ సేంద్రియ వ్యవసాయ శాఖను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, కేంద్ర నిధులతో ఈ ప్రకృతి వ్యవసాయ పథకం నడుస్తుందని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలో 351 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వీరికి గత 17 నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామాలు మండలాలు తిరిగి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వీరికి జీతాలు ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ, ట్రావెలింగ్ అలవెన్స్ కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలకై అనేకమార్లు అధికారులకు తెలియజేసినా సమస్య పరిష్కారం చేయకపోవడంతో ఉద్యోగులు విధులు బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. తక్షణమే బకాయిలు చెల్లించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి నాగేశ్వరరావు, కార్యదర్శి జి బుజ్జమ్మ, కే దేవి, ఎం శేషారత్నం, ఎస్ నాగేశ్వరరావు, ఎం వెంకటలక్ష్మి 24 మండలాల నుండి ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంస్కృతి గ్లోబల్ స్కూల్లో విద్యార్థి సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-పరవాడ : స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ప్రజాస్వామ్యయుతంగా ఈ నెల 3న బుధవారం విద్యార్థి సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో హెడ్ బాయ్‌గా గౌతమ్, హెడ్ గర్ల్‌గా జాహ్నవి, హౌస్ కెప్టెన్లుగా శ్రీజల్, అన్మోల్, సర్వేష్, తన్మయి ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి వీరిచే ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రేపటి సమాజం కొరకు విద్యా సంస్థలలో స్వచ్ఛంద సేవను అలవాటు చేసుకోవడానికి ఇటువంటి బాధ్యతలు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- కశింకోట : వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం కశింకోటలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుంటూరు కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ వారు ఏర్పాటు చేసిన జిల్లా టీం ఆఫీసర్ సిహెచ్‌వి చౌదరి, ఎ.రవి ప్రసాద్ తదితరులు కసింకోట మండల కేంద్రంలోని సత్యనారాయణ ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ స్టోర్‌లో ఈ తనిఖీలు చేశారు.

శేషుకొండ కాలనీలో బోరు బావి కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి - యలమంచిలి : శేషుకొండ కాలనీలో మంచినీటి అవసరాలకు వేసిన బావిని బోండా ఉమ అనే ఆమె కబ్జా చేసి తన ప్రహరీతో కలిపేసుకుందని స్థానిక పట్టణ తెలుగుదేశం సీనియర్ కార్యకర్తలు భీశెట్టి చిన్నారావు, ఆడారి ఆదిమూర్తి, ఎ.రమణబాబు మున్సిపాలిటీ కమిషనర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. బోండా ఉమ బోరుబావిని ఆక్రమించి ప్రహరీ నిర్మించుకొని ఇతరులెవరినీ రానివ్వడం లేదని పేర్కొన్నారు. అంతే కాకుండా అందులో సబ్‌మెర్సిబుల్ పంపు సెట్ బిగించుకొని ఇంటి అవసరాలకు వాడుకుంటుందని తెలిపారు. దీనిపై వారంతా కమిషనర్‌కు శనివారం ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొణతాలను కలిసిన పెంటారావు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్ వీరాభిమాని కొల్లిమల్ల పెంటారావు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిశారు. పుట్టికలోనే మూగ చెవిటి ఉన్న పెంటారావు 2024 ఎన్నికల్లో పిఠాపురంలో పవన్ కళ్యాణ్ గెలిస్తే అయోధ్యకు సైకిల్‌పై వస్తానని మొక్కుకున్నాడు. పవన్ కల్యాణ్ గెలిచి అసెంబ్లీకి వెళ్లిన రోజే పెంటారావు సైకిల్ యాత్ర చేపట్టిన అయోధ్యకు 12 రోజులకు చేరుకున్నాడు. తిరిగి వచ్చిన కొణతాలను కలిశారు. ఈ సందర్భంగా పెంటారావును కొణతాల సత్కరించారు. పెంటారావు విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తారని కొణతాల హామీ ఇచ్చారు.

విలువిద్య పోటీల్లో గణేష్‌కు కాంస్య పతకం

ప్రజాశక్తి -పరవాడ : స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ పూర్వ విద్యార్థి తిరువూరు గణేష్ మణిరత్నం ఇంటర్నేషనల్ ఆర్చరీ పోటీలో కాంపౌండ్ ఫైనల్- 2024 ఆసియా కప్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. ఈ మేరకు శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్చరీ అసోసియేషన్, సంస్కృతి గ్లోబల్ స్కూల్ సంయుక్తంగా గణేష్‌కు సన్మానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు పి. సూర్యనారాయణ రెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు పి.సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కర్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, సీఈఓ కె. నిశాంత్, కోచ్ కమల్, గణేష్ తండ్రి హరి ప్రసాద్ పాల్గొన్నారు.

నారాయణరావుకు నివాళి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎఎంసి మాజీ చైర్మన్ మొకర నారాయణరావు వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో అతని కుటుంబ సభ్యులు, నాగ వంశ సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు కె.ముత్యాలరావు, కె.రామానాయుడు, గాడు సన్యాసినాయుడు, ఎస్.జోగారావు, కనకల సన్యాసినాయుడు, కెవిఎస్ఆర్.కృష్ణారావు, జీవిఎంసి 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మూడో వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్ పాల్గొన్నారు

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఆనందపురం : ఉమా నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యాన మండలంలోని ఎల్‌వి.పాలెం గ్రామంలో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బమ్మిడి శ్రీతారక్ తెలిపారు.

సింహాచలం దేవస్థానానికి పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి- సబ్బవరం : ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే తాను లింగాల తిరుగుడు నుండి సింహాచలం దేవస్థానానికి పాదయాత్ర చేస్తానని మొక్కుకున్న మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామ సర్పంచ్ దాడి లావణ్య, కన్నంనాయుడు శనివారం పాదయాత్రను చేపట్టారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి ఈ పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో తమ ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టనుందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే పంచకర్ల చినయాత పాలెం వరకు పాదయాత్రలో నడిచారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, శరగడం రాము, కర్రి కనకరాజు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, దొడ్డి సూర్య ప్రకాష్, దొడ్డి రాజుకోటి, దాసరి వెంకట రమణ, ఆడారి నాగరాజు, పడాల వెంకటరమణ, ఎ.బంగారయ్య, వెంకట సత్తి, బంతికోళ్ల పద్మ, పెద్దాడ రమణమ్మ పాల్గొన్నారు.

మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించి, ఉపాధి కల్పించాలి

ఫార్మా కంపెనీలు, రాంకీ యాజమాన్యానికి తహశీల్దార్ ఆదేశాలు

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ మండలంలోని మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించి, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఫార్మా కంపెనీలకు, రాంకీ యాజమాన్యానికి తహశీల్దారు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కాలంలో ఫార్మా వ్యర్థ రసాయనాలు కలవడం వల్ల ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో చేపలు పెద్ద ఎత్తున మృత్యువాత పడడంతో మత్స్యకారులకు భారీ నష్టం వాటిల్లింది.ఉప్పుటేరుతో పాటు సముద్రంలో కూడా ఫార్మా రసాయనాలు కలవడం వలన మత్స్య సంపద మృతి చెంది మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది కలుగుతోంది. దీంతో మత్స్యకారులు ఇటీవల తహశీల్దారు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పరవాడ తహశీల్దారు ఎస్.గణపతిరావు స్పందించి రాంకీ, ఫార్మా కంపెనీలకు ఈ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందో? లేదో అని మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు.

ప్రజాప్రతినిధులు వేతనాలు తీసుకోకుండా పని చేయాలి

ప్రజాశక్తి-చోడవరం : ప్రజా ప్రతినిధులు వేతనాలు తీసుకోకుండా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని ప్రొడ్యూసర్ కౌన్సిల్ సహాయ కార్యదర్శి నటి కుమార్ అన్నారు. చోడవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడితే ప్రజాప్రతినిధులుగా ఎన్నో ఆశలతో గెలిపించిన ఓటర్లకు న్యాయం చేయాలని, ఇందుకోసం రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడమే సరైన మార్గమని చెప్పారు. అనేక రకాల ప్రభుత్వ స్థలాలు, గనులు ఆక్రమణకు గురు కాకుండా వాటిపై ఆదాయ మార్గాలను పెంచుకునే ఆలోచన చేయాలన్నారు. మార్కెట్ ధర ప్రకారం రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించి భూములు రిజిస్ట్రేషన్ జరగాలని, దీని వల్ల అమాంతంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. మేజర్ పంచాయతీల్లో వసూలు చేస్తున్న పన్నుల్లో ప్రభుత్వానికి 20 శాతం మాత్రమే చేరుతుందని, చోడవరం పంచాయతీలో ఇటువంటి అవకతవకలు ఎన్నో చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.

వైసిపి శ్రేణులపై దాడులు సరికాదు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం నియోజకవర్గంలో వైసిపి శ్రేణులపై టిడిపి కార్యకర్తలు దాడులు సరికాదని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. రావికమతం, రోలుగుంట మండలాల్లో వైసిపికి ఓటు వేశారని ఎస్సీ సామాజిక తరగతికి చెందిన వారిపై టిడిపి కార్యకర్తలు దాడులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఇటువంటి తప్పిదాలకు పాల్పడడం వల్ల భారీ మూల్యం చెల్లించుకోవలసి వచ్చిందని, టిడిపి కూడా భవిష్యత్తులో అదే ఎదురవుతుందని పేర్కొన్నారు. అధికారం శాశ్వతం కాదని టిడిపి కార్యకర్తలు గుర్తుతెరగాలన్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని చెప్పారు. ఈ నెల 8న వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 4 మండలాలు చెందిన వైసిపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -మునగపాక : డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో చూచుకొండ పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్ ఎస్తేర్ రాణి ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్తేర్ రాణి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భీమరశెట్టి శ్రీనివాసరావు, శరగడం అప్పలనరస, బీవీ రమణ, సూరిశెట్టి రాము, మల్ల రామ జోగి నాయుడు, దొడ్డి భాస్కరరావు, వైద్య సిబ్బంది గుర్రం శ్రీనివాసరావు, జి లక్ష్మణరావు, ఏఎన్ఎంలు, ఎమ్మెల్ హెచ్ పి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యాన పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని గణపర్తి గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం పూడికపోయిన కాలువల క్లీనింగ్, పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువకులు చదరం మురళీ, కలగ గంగాధర్, యల్లపు నవీన్ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కర్రి వెంకినాయుడు, మారిశెట్టి అప్పలరాజు, ఎం.దిలీప్, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణకు సమిష్టిగా కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : డయేరియా నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని తుమ్మపాల పంచాయతీ, గవరపేటవీధిలో అంగన్వాడి కేంద్రం వద్ద శనివారం ఏర్పాటు చేసిన స్టాప్ డయేరియా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఆశా వర్కర్లు, నాయకులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ పిహెచ్‌సి ఆధ్వర్యాన శనివారం పరవాడ గ్రామంలో 'అతిసార నియంత్రణ' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ కరిష్మా, వైద్య సిబ్బంది సాయిరాం, జానకిరామన్, పివి.రత్నం పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట కస్పా వీధిలో మండల మహిళా సమాఖ్య, పిహెచ్‌సి ఆధ్వర్యాన శనివారం స్టాప్ డయేరియా పై మహిళాలు, గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు. మోసయ్యపేటలో ఆరోగ్య బోధకులు ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ జి.నర్సింగరావు అవగాహన కల్పించారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నారపాడు సచివాలయంలో గురువారం సర్పంచ్ మామిడి శంకరరావు రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు కోరుపోలు గోవింద్, కో ఆప్షన్ సభ్యులు గొర్లి నూకరాజు, మాజీ ఎంపీటీసీ రొంగలి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ ముత్యాల నాయుడు, బలిరెడ్డి నూకరాజు, జెట్టి అప్పల రాజు, మామిడి ప్రసాద్, స్వామి దేవి వీర సత్యనారాయణ, రొంగలి ముసలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి కేన్సర్ లక్షణాల గుర్తింపు

ప్రజాశక్తి-కోటవురట్ల: స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సుంకపూర్ గ్రామంలో హోమీ బాబా కేన్సర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నమిత, డాక్టర్ మానసి 32 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీరిలో నలుగురికి లక్షణాలున్నట్లు ప్రాథమిక పరీక్షల్లో కనిపించడంతో వ్యాధినిర్ధారణ పరీక్షలు హోమీబాబా ఆసుపత్రిలో చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి, పిహెచ్సి వైద్యులు సంతోష్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త వరి వంగడాలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-గొలుగొండ:అధిక దిగుబడులు ఇచ్చే కొత్తరకం వరి వంగడాలను వాడాలని లింగంపేట మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, లింగం దొరపాలెం మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ అన్నారు. శనివారం లింగంపేట సచివాలయలో విత్తనాలను పంపిణీ చేశారు.కొత్త వంగడాల వల్ల పంటకు వచ్చే తెగుళ్ల తగ్గుతాయని వ్యవసాయాధికారులు అంటున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆత్మ బిటియం చిటికెల లక్ష్మి కిషోర్, టిడిపి అనకాపల్లి జిల్లా టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు గోలకొండ శ్రీకాంత్, గ్రామ కమిటీ అధ్యక్షులు మరిసా వెంకటరమణ, నాయకులు మిడతన సూరిబాబు, జనసేన నాయకులు సలాదుల ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల,: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని విత్తన ఉత్పత్తి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా అధికారుల బృందం సిసి చౌదరి,ఎ.రవి ప్రసాద్ అన్నారు. శనివారం తంగేడు గ్రామంలో ఉన్న విత్తన ఉత్పత్తి కేంద్రం పరిశీలించారు. కేంద్రంలో ఉన్న విత్తనాలను వాటి నాణ్యతను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఎఒ సరోజిని, యూనిట్ సభ్యుడు పాత్రుడు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలో రాజయ్యపేటలో శనివారం ఉచిత యోగా శిక్షణా తరగతులను వేంపాడు ఆయుర్వేద ఆసుపత్రి యోగా టీచర్ దవరసింగి రాంబాబు ప్రారంభించారు. పిల్లలకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం ,సూర్య నమస్కారాలపై శిక్షణ ఇచ్చారు. 20 రోజుల శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హైస్కూల్ హెచ్‌ఎం నారాయణరావు పాల్గొన్నారు.

సెల్ రీఛార్జ్ ధరలు తగ్గించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-ఎస్ రాయవరం : జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్, ఇతర ప్రయివేటు సర్వీస్ ప్రొవైడర్లు ఇబ్బడిముబ్బడిగా పెంచిన సెల్ రీఛార్జ్ ఛార్జిలను తగ్గించాలని కోరుతూ, శనివారం మండలంలో అడ్డరోడ్డు కూడలి వద్ద సిపిఎం మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్రంలో మోడీ మూడోసారి అధికార పీఠం ఎక్కిన తర్వాత ప్రయివేట్ సెల్‌ప్రొవైడర్లు రీఛార్జి ధరలను విపరీతంగా పెంచి వినియోగదారులపై రూ.20వేల కోట్ల భారం వేయడం దుర్మార్గమన్నారు. జియో 12.25 శాతం, ఎయిర్‌టెల్ 11.21 శాతం ఛార్జీలను పెంచడం దుర్మార్గమన్నారు. దేశంలో కోటి 20 లక్షల మంది బిఎస్ఎన్ఎల్ వినియోగదారులున్నారని, ప్రభుత్వరంగ సంస్థ బిఎస్ఎన్ఎల్‌ను పరిపుష్టి చేసే అవకాశాలున్నా కేంద్ర ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేయాలని చూస్తోందని, తద్వారా ప్రయివేటు సెల్ ప్రొవైడర్లకు లాభాల పందేరానికి తెరదీసిందని మండిపడ్డారు. ఇప్పటికే పోస్టల్, రైల్వే,విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగ సంస్థలకు కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలు చేపట్టిన కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వం, ఇపుడు బిఎస్ఎన్ఎల్‌ను కూడా అదేబాటలో కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతోందన్నారు. జియో రావడంతోనే ఫ్రీనెట్, కాల్స్ అంటూ ప్రజల్లో సెల్‌వాడకం పెంచేలా చేసి, ఇపుడు ఛార్జీల భారంతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. పెంచిన రీచార్జి ధరలను జియో, ఎయిర్‌టెల్ తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో బిఎస్ఎన్ఎల్‌ను 5జీ సేవలకు పెంచి, వాటి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా ప్రయివేటు సెల్ ప్రొవైడర్ల ఆగడాలకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టాలని డిమాండ్ చేశారు.
లేకుంటే దేశంలో చేపట్టిన రైతాంగ ఉద్యమం లాంటి మరో ఆందోళన చేపట్టడం ఖాయమని హెచ్చరించారు. వెంటనే పెంచిన సెల్ చార్జీలు తగ్గించాలని పాత పద్ధతుల్లో కొనసాగించాలని అయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుర్రం సత్యనారాయణ అప్పన్న ఈశ్వరవు రమణ పాల్గొన్నారు.

గ్రామసభలో సమస్యల ఏకరువు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోటలో శని వారం గ్రామసభలో సమస్యలపై గ్రామస్తులు ఏకరువు పెట్టారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం, తాగునీటి ఇబ్బందులు, పారి శుధ్య నిర్వహణ, డ్రైయిన్ వ్యవస్థ సక్రమంగా లేక పోవడం, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయలపై పంచాయతీ అధికారులను నిలదీశారు. స్థానిక సర్పంచ్ కొన లోవరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రైతు భరోసాకేంద్రాల్లో జాప్యం, విద్యుత్ సమస్య, తాగునీటి కుళాయిలు ఏర్పాటుపై పరిశీలించి, నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు. 12 వ వార్డు మట్టా వీధి, ప్రకాష్ నగర్, అంబేద్కర్ కాలనీలలో డ్రైయిన్ వ్యవస్థ నిర్మాణం, 13 వ వార్డులో తాగు నీటి కొరత నివారణకు చర్యలు, 9వ వార్డు అయ్యప్ప స్వామి గుడి సమీపంలో రహదారి నిర్మాణం పనులు పూర్తి చేయాలని తదితర అంశా లపై చర్చించారు. వెలుగుశాఖలో బ్యాంకు లింకేజి లోన్స్, స్త్రీ నిధి వసూళ్లలో జరుగు తున్న అవకతవకలపై కూడా విచారణ చేపట్టాలని సభలో పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర నివేదికను పంపుతామని ఇఒ జి.కోటేశ్వరరావు వెల్లడించారు. ముందుగా జడ్పిటిసి తలారి రమణమ్మ మృతి కి కొద్ది సేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ లక్ష్మణ రావు, ఉపసర్పంచ్ పందల దేవ, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, ఎంపిటిసి పూడి దేవ, కుంచా శంకర్, సచివాలయం సిబ్బంది, టిడిపి నాయకులు ఉగ్గిన శ్రీను, కోట సత్తిబాబు,జనసేన చింతల కిషోర్, కొన రమణ, వైసిపి నేతలు పాల్గొన్నారు.

దాడి ఘటనపై డిఎస్‌పి దర్యాప్తు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొమిర మత్స్యపురం గ్రామ దళితుడు మామిడి రాముపై దాడి ఘటనపై అనకాపల్లి ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసుల డిఎస్‌పి అప్పలరాజు శనివారం సంఘటనా స్థలంలో విచారణ చేపట్టారు ఎపి రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనకు పోలీసు అధికారులు స్పందించారు..ఈ నెల 4 న గురువారం రాత్రి గుమ్మాల పాడు శివారు పారమ్మ చెరువు వద్ద దారి కాచి చినపాసిల గ్రామానికి చెందిన విఆర్‌పి కోరుకొండ ప్రసాద్, కోమటి రామయ్య, సాసుపల్లి భరత్ కుమార్, శివ, నక్క రమేష్ నాయుడు తదితరులు తనను, కొట్టి, కులం పేరుతో దూషించారని బాధితుడు మామిడి రాము రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేసాడు. దీనిపై రావికమతం ఎస్ఐ ధనంజయనాయుడు కేసు నమోదు చేయగా, డిఎస్‌ఫి దర్యాప్తునకు వచ్చారు.

నిందితులను అరెస్టు చేయాలి:

కెవిపిఎస్, రెల్లి హక్కుల పోరాట సమితి

దళితుడు మామిడి రాముపై విచక్షణా రహితంగా దాడి చేసి, కులం పేరుతో దూషించిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఎపి రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు వై పాపారావు,ె కవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు.శ`నివారం బాధిత మామిడి రాము కుటుంబాన్ని వారు పరామర్శించారు.దీనిపై హత్యానేరంతో పాటు అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి -గొలుగొండ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కేడీపేట పిహెచ్‌సి వైద్యాధికారి హరి ప్రవీణ్ అన్నారు. వనివారం మండలంలో లింగంపేటలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరూ వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. డయేరియా ప్రబలినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలువురికి బిపి, షుగర్, క్యాన్సర్, టీబి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలతో పాటుగా రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.సచివాలయ పరిధిలో ఉన్న పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచం పట్టిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటికి వెళ్లి వైద్యసేవలు నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ప్రియాంక, హెల్త్ అసిస్టెంట్ జయకృష్ణ, ఎఎన్ఎం ఉమ, 104 సిబ్బంది శ్రీను, శివ, ఆశా కార్యకర్తలు అచ్చితల్లి, మంగలక్ష్మి, రాజులమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు హెచ్‌పివి టీకాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఎం. మూర్తిరాజు, దిగుమర్తి ఫౌండేషన్, మానవసేవ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అగనంపూడి కేన్సర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రఘునాధరావు, వైద్య బృందం విద్యార్థులకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పివి) టీకాలు వేశారు. విద్యార్థి దశనుండే దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, ప్రియాంక, నాగేంద్రబాబు, లీల పాల్గొన్నారు.

హాస్టల్ బకాయి నిధులను విడుదల చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :వసతి గృహాలకు బకాయిలు పడ్డ నిధులను తక్షణమే విడుదల చేయాలని అఖిలభారత వ్యవసాయ,గ్రామీణ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్ నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్నిఅందజేశారు. సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ హాస్టళ్లకు బకాయి పడిన నిధుల విడుదలకు కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ స్థానిక బీసీ బాలుర హాస్టల్ మరుగుదొడ్లు పూర్తిగా నిరుపయోగంగా మారాయన్నారు. అన్నిహాస్టళ్లకు నోడల్ ఆఫీసర్స్‌ను పంపి సమస్యలు, సౌకర్యాలపై నివేదిక తెప్పించి, వాటిని పరిష్కరిచాలన్నారు. కార్యక్రమంలో గొలుగొండ, నాతవరం, రోలుగుంట మండలాల హాస్టల్ పిల్లల తల్లిదండ్రులు దుంప ప్రసాద్, గోరా సూరిబాబు, ఈదల ఆదిలక్ష్మి, తుర్రె రవి, కేదారి దేవి, మోసూరీ రాము పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జయంతిని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఈ నెల 8న మాజీ ముఖ్యమంత్రి వైయస్.రాజశేఖర్ రెడ్డి జయంతిన విజయవంతం చేయాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో వైయస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించాలన్నారు. సేవా కార్యక్రమాలు చేయాలని నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్



కోటవురట్లలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మండల కేంద్రంలో పశు వైద్యశాల వద్ద 54పెంపుడు కుక్కలకు పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సింహాద్రప్పడుఉచితంగా రాబిస్ టీకాలను వేశారు. జంతువుల పెంపకంపై యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశు వైద్యులు డాక్టర్ ప్రతాప్ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు

చీడికాడ: జునోసిస్ డే సందర్భంగా మండలంలోని అన్ని పశు వైద్యకేంద్రాల వద్ద పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్లు పెద్ద గోగాడ పశు వైద్య రాలు ఏవీఎస్ రాఘవమ్మ తెలిపారు కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ కె. స్. రాఘవమ్మ. ఎల్ఎస్ఎ వర్మ, విఎ దుగ్గిరాల మనోజ్‌కుమార్ రాజేష్, అర్జున్ మూర్తి, సాయి, శేషు, గంగునాయుడు, ఎం శ్రీనివాసరావు, పశు వైద్య సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ప్రాంతీయ పశు వైద్యశాలలో 120పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేశారు. . ప్రాంతీయ పశువైద్యశాల ఏఓ డాక్టర్ రాంబాబు కుక్కల పెంపకంపై జాగ్రత్తలు వివరించారు. చెట్టుపల్లి డాక్టర్ పుష్ప, గొలుగొండ డాక్టర్ ఎల్.రమేష్, చోద్యం డాక్టర్ కె.రామ్మోహన్, కేడిపేట డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

యలమంచిలి: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జంతువుల నుంచి మానవాళికి సంక్రమిస్తున్న వ్యాధులపై (జునోటిక్ వ్యాధులు) స్థానిక కొత్తపేట హైస్కూలు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం శనివారం నిర్విహించారు. ఈ సందర్భంగా యలమంచిలి పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గంగాధర్ 152 పెంపుడు జంతువులకు ఏన్టీ రేబిస్ వ్యాక్సిన్ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంఇఒ మీనాక్షి, హెచ్ఎం రమణ, పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం పశు వైద్యశాలలో 29 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యధికారి బి. రాము,ఉపాధ్యాయులు, విద్యార్థులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జెడ్‌పి హైస్కూల్లో హెచ్ఎం ఆర్.రామలక్ష్మి ఆధ్వర్యాన పశు వైద్యాధికారి మంజుస రాణి విద్యార్థులకు జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ పడాల్ దాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కన్నూరు పాలెం పశు వైద్య అధికారి డాక్టర్ దయానా ఆధ్వర్యాన కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో నిమ్మదాల సన్యాసినాయుడు, నైనం శెట్టి రమణారావు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని సబ్బవరం, అంతకాపల్లి, గుల్లేపల్లి, ఆరిపాక పశు వైద్య కేంద్రాలలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఉషా కుమారి ఆధ్వర్యాన 135 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాల వేశారు. పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పశు వైద్యులు స్వర్ణలత, అరుణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక పశువైద్యశాలలో కుక్కలకు రేబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శనివారం ప్రారంభించారు. 250 కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక పశువుల ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్, ఆసుపత్రి లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎస్.కె సమీరా, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి గాంధీనగరం ప్రభుత్వ పశు వైద్యశాలలో శనివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి ప్రసాదరావు ప్రారంభించారు. ఏడి డాక్టర్ బి.సౌజన్య ఆధ్వర్యాన 253 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. గవరపాలెం పశు వైద్యశాలలో డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో 110 కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు.

ఆరిలోవ : ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరిలోవ, తోటగరువు పశుసంవర్ధక శాఖ ఆసుపత్రిలో శనివారం సుమారు 516 కుక్కలకు రేబిస్ నివారణ టీకాలను ఉచితంగా వేశారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ ఆర్ఎంఒ డాక్టర్ ధవళ భాస్కరరావు, డిఎస్ఒ డాక్టర్ జగదీష్‌చంద్ర, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రామకృష్ణ, ఉప సంచాలకులు డాక్టర్ ఎన్.కరుణాకరరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, డాక్టర్ మోపాడ చంద్రశేఖరరావు, డాక్టర్ మోహనరావు, డాక్టర్ శంకరరావు, డాక్టర్ మదీనాప్రసాద్, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 40వ వార్డు పరిధి ప్రభుత్వ పశువైద్య శాలలో డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యాన పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, తెలుగుదేశం వార్డు ఇన్‌ఛార్జి ఆర్ఆర్.రాజు, తాతబాబు, సురేష్, రామారావు, శంకర్, మున్ను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దండపురం హైస్కూల్‌లో తనిఖీలు



విద్యార్థుల ప్రగతిని తెలుసుకుంటున్న డిప్యూటీ డిఇఒ అప్పారావు

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో ఉండడం, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో హెచ్ఎం డి.సత్యారావును అభినందించారు. తరగతి గదిలో విద్యార్థులను ప్రశ్నించి, సమాధానాలు రాబట్టడం ద్వారా ప్రగతిని తెలుసుకున్నారు .నోట్స్‌లను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై, తరగతుల వారీగా సమీక్షించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.. ముఖ్యంగా భాషలు చదవడం, రాయడంపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని, గణితంలో బేసిక్స్ నేర్పించాలన్నారు. టెన్త్‌లో గతేడాది కంటే మంచి ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణతో కృషి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న.భోజనం రుచి చూశారు. మెనూ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

'ఉపాధి' బకాయి తక్షణమే చెల్లించాలి



ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన కూలీల ఆందోళన

ప్రజాశక్తి- గొలుగొండ: మండలంలో బుడ్డడపాడు గ్రామంలో ఉపాధి కూలీలకు బకాయి పడ్డ ఎనిమిది వారాల బకాయిలు వెంటనే చెల్లించాలని నాన్‌షెడ్యూల్ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.శివ డిమాండ్ చేసారు. ఈ సంవత్సర కాలంలో చేసిన పనికి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. కూలి పనిపై ఆదారపడ్డ కార్మికలు ఎలా బతకాలని ప్రశ్నించారు. తక్షణమే ఉపాధి వేతన బకాయి చెల్లించాలని, లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు కార్యక్రమంలో సిఐటియు నాయకులు సెగ్గ రామకష్ణ, లక్ష్మి, పోతురాజు పాల్గొన్నారు.

ఎస్‌సి కాలనీలో తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ ఎస్‌సి కాలనీలో మండల పరిషత్ నిధులతో శనివారం తాగునీటి బోర్ వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కసిపల్లి అప్పారావు, మాజీ సర్పంచ్‌లు పారేపల్లి నాగేశ్వరావు, చిట్టిబాబులు, టిడిపి నాయకులు పుల్లేటికుర్తి రమేష్, జనసేన నాయకులు చిరంజీవి పాల్గొన్నారు

జనసేన కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆకాష్

ప్రజాశక్తి- కోటవురట్ల : మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాసరావు సౌజన్యంతో జనసేన కార్యకర్తలు నాయకులు ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని శనివారం జిల్లా నాయకులు గడ్డం బుజ్జి కుమారుడు ఆకాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో గడ్డం చైతన్య, మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు భాస్కరరావు, శివప్రసాద్, పలు గ్రామాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీకి సొంత భవనం సమకూర్చాలి

◆ హోంమంత్రి అనితకు ఎస్ఎఫ్ఐ నేతల వినతి



హోంమంత్రి అనితకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-నక్కపల్లి : నక్కపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంజరమణ, ఇతర నాయకులు కోరారు. శనివారం హోంమంత్రి అనితను అమె స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలు సమస్యలను ఆమెకు విన్నవించారు..నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటైన నుంచి సొంత భవనం లేనందున స్థానిక జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారని,దీని వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాయకరావుపేటలో బిసి బాయ్స్ కాలేజ్ హాస్టల్ , గర్ల్స్ హాస్టల్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ,అద్దె భవనంలో కొనసాగిస్తున్న హాస్టళ్లకు సొంత భవనాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై హోంమంత్రి అనిత స్పందిస్తూ, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం బాలాజీ ,వై సురేష్ ,కేశవ, శ్రీను, కృప ,రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అవార్డుల ప్రదానానికి హోంమంత్రికి ఆహ్వానం

అనకాపల్లిలో పిఆర్‌టియు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే ప్రతిభా అవార్డుల ప్రదానానికి రావాలని హోంమంత్రి వంగలపూడి అనితను శనివారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, యూనియన్ నాయకులు ఆహ్వానం పలికారు యూనియన్ జిల్లా అధ్యక్షులు గోపినాథ్, ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వేశ్వరరావు, జిల్లా మాజీ అధ్యక్షులు కాశీ ,నక్కపల్లి మండల అధ్యక్షులు తోడపు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ప్రగడ శివాజీ, ఎస్.రాయవరం మండల అధ్యక్షులు వీరభద్రరావు, ప్రధానకార్యదర్శి శ్రీను, నర్సీపట్నం మండల అధ్యక్షులు వరహాలు నాయుడు, సత్యనారాయణ, రమణ ఉన్నారు.

హోంమంత్రిని కలిసిన కలెక్టర్



కలెక్టర్‌తో చర్చిస్తున్న అనిత

నక్కపల్లి :రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను నూతన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేశారు. ఇరువురు పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఎస్ రాయవరం మండలం బంగారమ్మపాలెం ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలను కలెక్టర్‌కు హోంమంత్రి వివరించి, మత్స్యకారులు .చేపల వేటకు వెళ్లేలా అవకాశం కల్పించాలని సూచించారు. వైజాగ్,చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. స్థానిక కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగకల్పనపై చర్చించారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం , టిడిపి నేతలు కొప్పిశెట్టి వెంకటేష్, అబద్ధం, వినోద్ రాజు పాల్గొన్నారు .

ఇసుక ర్యాంపుల వద్ద నిరంతర నిఘా



అధికారులకు సూచనలు ఇస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ప్రజాశక్తి -నక్కపల్లి : జిల్లా వ్యాప్తంగా ఇసుక ర్యాంపులు వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి అధికారులకు ఆదేశించారు. శనివారం సాయంత్రం నక్కపల్లి ఇసుక ర్యాంపు ను పరిశీలించారు. ఇటీవల నక్కపల్లి ఇసుక డిపో వద్ద ఇసుకను అక్రమంగా కొంతమంది తర లించారనే ఆరోపణలు రావడంతో జెసి జాహ్నవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్,రెవెన్యూ, మండలపరిషత్, సచివాలయాల సిబ్బందితో నిరంతర నిఘా, సిసి కెమెరాలను ఏర్పటు చేయాలని ఆదేశించారు. షిఫ్ట్‌లవారీగాఇసుకపై నిఘా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి విజయ్ భాస్కర్, ఆర్‌డిఒ జయరాం, డిపిఒ శిరీషారాణి, ఆర్‌టిఒ మనోహర్, మైన్స్ ఎడి సుబ్బారాయుడు, సెబ్ అసిస్టెంట్ సూపరిటెండెంట్ శైలజారాణి బృందంగా ఇసుక డిపో నిల్వలను పరిశీలించారు. ప్రస్తుత ఇసుక పరిమాణంపై ఆరా తీసిన జెసి, నక్కపల్లి ర్యాంపు వద్ద 26వేల టన్నుల ఇసుక వుందని మైన్స్ ఎడి వివరించారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఒ శ్రీనివాస్, సీఐ అప్పన్న, ఎస్ఐ సన్ని బాబు, టిడి సత్యనారాయణ ఉన్నారు .

కాలనీలో సౌకర్యాల పరిశీలన

● మండల సభలో లేవనెత్తిన సమస్యలపై తహశీల్దార్ స్పందన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో అతిపెద్ద జగనన్న లేఅవుట్ (కాలనీ)కు రహదారి, మౌలిక వసతులు లేవంటూ ఇటీవల మండల పరిషత్ సమావేశంలో సభ్యులు లేవనెత్తడంతో స్పందించిన స్థానిక తాహసిల్దార్ వెంకటరమణ, శనివారం లేఅవుట్ ను పరిశీలించారు, ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు లేఅవుట్‌కు రహదారి సౌకర్యం, మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రత్యక్షంగా చూపించారు. అంతే కాకుండా లే అవుట్ మధ్య నుంచి 33 కెవి విద్యుత్ లైన్ వెళ్లడంతో నిర్మాణాలు నిలిపేసుకున్నామన్నారు. లింగాపురం నుంచి వచ్చే పంట చెరువు కాలువ ను సైతం ఆక్రమించుకుంటూ నిర్మాణాలు చేపట్టడంపై సమగ్ర పరిశీలన చేశారు. మండల సర్వేయర్ ను రప్పించి రికార్డులు పరిశీలించారు, ఈ సందర్భంగా ఇష్టారాజ్యంగా పలువురు లబ్ధిదారులను ఎంపిక చేసిన విషయాన్ని స్థానిక ఎంపిటిసి సూర్యారావు తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు, సౌకర్యాలు లేకపోవడం వల్లే



కాలనీలో రోడ్డును పరిశీలిస్తున్న తహశీల్దార్

పలువురు లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేసి తాళాలు వేసి వెళ్ళిపోతున్నారని కనీసం కాలనీకి విద్యుత్, తాగునీరు, రోడ్లు లేకుంటే జీవనం ఎలాగని తహశీల్దార్ ముందు పలువురు వాపోయారు. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తహశీల్దార్ భరోసానిచ్చారు. హౌసింగ్ ఎఇ జగదీశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డులు అందుకున్న రోటరీ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ :ఇటీవల విజయవాడలో జరిగిన రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ అవార్డులలో 85 క్లబ్‌లు పాల్గొనగా, నర్సీపట్నం రోటరీ క్లబ్‌కు 19 విభాగాలలో ప్లాటినం, డైమండ్, గోల్డ్ అవార్డులు లభించాయి. వీటిని 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ దత్త చేతుల మీదుగా స్వీకరించారు. రోటరీ క్లబ్ ఈ సంవత్సరం నిర్వహించిన బ్లడ్ క్యాంపుల నిర్వహణ, పర్యావరణహితమైన వినాయక విగ్రహాల పంపిణీ, పోలియో నిర్మూలన ఫండ్, వాటర్ ప్లాంట్ నిర్మాణం, పాఠశాల వసతుల కల్పన, ఏజెన్సీ ప్రాంతంలో కిరాణా సరుకులు, దుస్తులు మెడికల్ క్యాంపు నిర్వహణ వంటి సేవా కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని ఈ అవార్డులు దక్కాయి. కార్యక్రమంలో ఫాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ సుతాపల్లి శ్రీకాంత్, క్లబ్ ప్రెసిడెంట్ మాలే మహేష్ కుమార్ ,సెక్రటరీ వై.శ్రీనివాస రావు ట్రెజరర్ పి.కొండలరాయుడు, మహారాజా హోటల్ మహేష్ వర్మ, కె.శ్రీనివాసరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.రోటరీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు పలు అవార్డులు దక్కడంపై హర్షం వ్యక్తమౌతోంది.

హోంమంత్రి పిఆర్‌ఒకు అభినందన

ప్రజాశక్తి -నక్కపల్లి : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు పిఆర్‌ఒగా ఎస్ రాయవరం మండలం, కొత్త రేవు పోలవరం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ యజ్జల బంగారు చిట్టి నియమితులయ్యారు. ఆయనను టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్,మత్స్యకార జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరయ్య ,రాష్ట్ర జనరల్ సెక్రటరీ పిక్కి కోదండరాం తదితరులు అభినందించి, సత్కరించారు.మత్స్యకార నాయకులు వాసుపల్లి అడివి రాజు,అర్జలి శ్రీను, పిక్కి కోదండరావు (బుజ్జి), గంపల అప్పన్న, గంపల ఆనంద్, కోడ లోవరాజు,కారే సూరిబాబు ,నూకరాజు, ముత్తి రమణ, రాజేష్, దూడ నూకరాజు పాల్గొన్నారు.